# నీలాగ ఎందరో...

-కొత్తపల్లి ఉదయబాబు

ఆర్.టి.సి. బస్ కాంప్లెక్స్‌లో బస్ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను. నేను పాలకొల్లు నుంచి తాడేపల్లిగూడెం వచ్చి పది నిముషాలైంది. పూళ్ళలో మా బ్రాంచికి వెళ్ళాలి. అందుకోసం ఏలూరు పాయింట్‌లో నిలబడి బస్ కోసం ఎదురు చూస్తున్నాను.

"సార్! మీకు అన్ని రకాలైన బుక్స్ నా దగ్గర లభిస్తాయి సార్! బుక్స్ సార్ బుక్స్" అంటూ ఒక ముసలాయన నా దగ్గరకు వచ్చాడు.

నేను ఆయనను పరిశీలించాను.

మాసిపోయి అక్కడక్కడ చిరుగులు కన్పిస్తున్న ఖద్దరు పంచె, జబ్బల దగ్గర కుట్లు విడిపోయి భుజాలు కొద్దిగా కన్పిస్తున్న పైజామా, మెడలో నవ్వారు పట్టీని దండగా ధరించి దానికి పాత కాలం చెక్క టేబులు సొరుగును వ్రేలాడదీసి అందులో రకరకాల పుస్తకాలు దొంతరలు దొంతరలుగా అమర్చి చేతిలో రెండు పుస్తకాలు పట్టుకుని నాకేసి ప్రపంచంలోని ఆశనంతటిని కళ్ళల్లోకి పోగేసుకుని ఆతృతగా ఎదురు చూస్తు న్నాడు.

"ప్లీజ్ సార్! ఒక్క రెండు పుస్తకాలు కొనండి సార్! ప్లీజ్!" మరల నన్ను ప్రాధేయపడ్డాడాయన.

"చూడండి నాన్న గారు! నాకు సాహిత్యం అంటే విపరీతమైన అభిమానం. అయితే ఉదయం లేచిన దగ్గర నుంచి క్యాంపులు లేదా ఆఫీసు వర్క్. యిలా ప్రయాణాలలో ఏదో ఒక వారపత్రికో, మాస పత్రికో కొంటాను. పది రూపాయలు ఖరీదు పెట్టి కొని పది పేజీలు చదవక ముందే ఏదో పని తగులుతుంది. అంతే ఆ పుస్తకం యింట్లో పడేస్తాను. మా యింట్లో ఎవరికీ ఈ పుస్తకాలు చదివే అలవాటు లేదు. దాంతో యింటి నిండా పుస్తకాలు పేరుకుపోయి యింట్లో ఆడవాళ్లు పచ్చ గడ్డి పెట్టేస్తున్నారు. నాకేమో సర్దడానికి టైం ఉండదు. అలా అని ఎంతో ఖరీదు పెట్టి కొనుక్కుంటున్న పుస్తకాలు కేజీకి రూపాయి చొప్పున అమ్మేస్తుంటే గుండె పిండేసినట్టవుతుంది నాకు.

నా కష్టార్జితం అలా దుర్వినియోగం అవుతున్నం దుకు కాదు. ఒక పుస్తకం అలా తయారవడానికి ఎందరో సమిష్టి కృషి అవసరం. పత్రిక స్థాయిని నిలబెట్ట డానికి రచయితలు ఎంతో శ్రమించి రాయాలి. వారికి పత్రికా సంపాదకులు పారితోషికం అందించే స్థాయిలో ఉండాలి. దానిని ఎంతో పకడ్బందీగా ఎడిటింగ్ చేసి అందంగా ప్రచురించి మార్కెటింగ్ చేయగలగాలి. యింత చేస్తే చివరకు అమ్మే వాడికి పుస్తకానికి రూపాయి మిగిలితే గొప్పే..."

యింకా ఏదో చెప్పబోతున్నాను.

"మరోసారి చెప్పండి బాబూ!..." అన్నా డాయన మార్దవం నిండిన కళ్ళతో.

"ఈయనకేమయినా పిచ్చా! కాలక్షేపం కోసం నేను సోది వేస్తుంటే మళ్ళీ చెప్పండి అంటా డేమిటి?" అనుకున్నాను.

ఆయన తత్తరపడ్డాడు.

"అది కాదు బాబూ! మొదట్లో మీరు నన్ను అదేదోలా పిలిచారు!"

"ఓ అదా! నాకు వూహ వచ్చిన రోజుల్లో మా నాన్న గారు పోయారు. యింగ్లీషు చదువులు చది విస్తున్నా "డాడీ" ""నాన్న" అంటే ఆయన చిరాకు పడేవారు. ఆప్యాయంగా "నాన్న గారూ" అని పిలవడం నేర్పారు. అలా పిలిస్తే పెద్దల ఎదుట గౌరవంతో పాటు తండ్రి మాటకు చక్కని విలువ నిస్తారని ఆయన అభిప్రాయమని నేను తండ్రి నయ్యాక తెలిసింది. ఇది నా స్వంత అభిప్రాయం అనుకోండి. అప్పటి నుంచి వయసులో వృద్ధులైన మీలాంటి పెద్దలను "నాన్న గారూ" అని పిలవడం అలవాటు చేసుకున్నా నాన్న గారూ!"

నా మాటలు పూర్తి కాకుండానే ఆయన కళ్ళు వూటబావులై స్రవించసాగాయి.

నిస్సత్తువగా ఆయన బెంచీ మీద కూల బడ్డాడు.

నాకు మనసు అదోలా అయిపోయింది. ఆయనను ఎలా ఓదార్చాలో అర్థం కాక వెర్రి చూపులు చూస్తున్న నాకు ఎడారిలో స్ప్రైట్ డ్రింక్ దొరికినట్టుగా 'చక్రవర్తి' కనిపించాడు. వాడు నా క్లాస్‌మేట్. చాలాకాలం తర్వాతనైనా తేలికగానే గుర్తు పట్టాను.

"ఒరేయ్! చక్రవర్తీ!" అంటూ గట్టిగా అరిచాను.

వాడిటు తిరిగి నన్ను చూసి విస్తుపోయాడు. "ఒరేయ్ ప్రభాకర్! నువ్వు... యిక్కడ..." అంటూ ఆనందంగా చేతులు చాస్తూ నావైపు రాబోయిన వాడల్లా ఆగిపోయి-

"ఒక్క పది నిముషాల్లో వస్తారా! ఓ ఫ్రెండ్‌ని కలవాలి అర్జంటుగా. వాడు ముందు నడుస్తు న్నాడు. ప్లీజ్ వెయిట్ చెయ్యి. బస్ వచ్చినా ఎక్కెయ్యకు" అంటూనే వడివడిగా అడుగులు వేసుకుంటూ కాంప్లెక్స్ బయటకు వెళ్ళిపోయాడు చక్రవర్తి.

యింతలో ముసలాయన సంబాళించుకుని లేచాడు.

"వస్తాను బాబు! నా దగ్గర పుస్తకం కొనక పోయినా లక్షల విలువ చేసే పదంతో నన్ను పిలిచారు. నాకు చాలా ఆనందంగా ఉంది బాబూ!" అంటూ లేచి ఆయన మెడలో వ్రేలాడు తున్న టేబుల్ సొరుగును సరిగా అమర్చుకుని "ఈ వేళ్టికి మందు బిళ్ళ వేసుకునే యోగం లేనట్టుంది" అని గొణుక్కుంటూ చేతిలోని పుస్తకా లతో ముందుకు నడవబోయాడు.

నేను ఎలర్ట్ అయ్యాను.

"ఒక్క క్షణం నాన్న గారు. మందు బిళ్ళ వేసు కోవడం ఏమిటి?" అడిగాను.

"ఏం లేదు బాబు! ఉదయం ఆరింటి నుంచి ఎనిమిది గంటలలోగా పుస్తకాలు అమ్మిన డబ్బు లతో రెండు యిడ్లీ తిని టీ తాగి మూడు మాత్రలు మింగుతాను. మధ్యాహ్నం రెండింటి వరకు అమ్మిన డబ్బులతో వీలయితే భోజనం చేస్తాను. లేదా మళ్ళీ యింత టిఫిన్ తిని మూడు మాత్రలు మింగుతాను. మళ్ళీ రాత్రి ఎనిమిది గంటల వరకు అమ్మి వచ్చిన డబ్బులతో మళ్ళీ అదే పని చేస్తాను. ఏమీ తినకపోతే మాత్రలు కడుపులో పేగుల్ని మెలి తిప్పేస్తాయి బాబు. అవే నన్ను బ్రతికించే సంజీ వనులు" అన్నాడాయన నిస్పత్తువగా.

ఆయనను నీరసం ఆవహిస్తోందని నాకు అర్థం అయింది.

"నేను టిఫిన్ పెట్టిస్తా రండి నాన్న గారు!" అన్నాను ముందుకు దారి తీయబోతూ.

"వద్దు సార్! బ్రతికినంత కాలం మన కష్టార్జితంతోనే బ్రతకాలి. అదీ న్యాయబద్ధంగా సంపాదించిన సొమ్ముతోనే- అని ఆలస్యంగా తెలుసుకున్నాను- వద్దులెండి" అంటూ వెళ్ళ బోయాడాయన.

"నేను మీ దగ్గర పుస్తకాలు కొనుక్కోవద్దా?" అంటూ చనువుగా ఆయన చెయ్యి పట్టి ఆపి ఆ పుస్తకాలు పరిశీలించాను.

గుడిపాటి వెంకటాచలం కథలు, కొడగంటి కుటుంబరావు కథలు, ఆరుద్ర గారి కూనలమ్మ పదాలు పుస్తకాలు తీసుకున్నాను. నేనసలు చదవనివి అవి. కొత్త రంగు పోయి మాపు రంగుకు చేరుకున్నాయి. వాటికి డబ్బిచ్చేశాను.

ఆయన సంతోషంగా కళ్ళకద్దుకుని నమస్క రించబోయి ఆశీర్వదించినట్టుగా చెయ్యి వూపి వెళ్ళిపోయాడు.

ఆయన అటు వెళ్ళాడో లేదో యిటు చక్రవర్తి యింత మొహం చేసుకుంటూ వచ్చి కౌగలించు కున్నాడు.

నా సంతోషానికి కూడా అవధులు లేకుండా పోయింది. వాడి రాకతో అప్పటి వరకు బరువుగా ఉన్న వాతావరణం తేలిక పడ్డట్టుగా అనిపించింది. వాడితో కబుర్లలో పడిపోయాను.

★★★

"ఏరా! ఎంత కాలమైందిరా నిన్ను చూసి? బాగున్నావా!" అంటూ పలకరింపుగా నా రెండు చేతులూ పట్టుకుని అన్నాడు చక్రవర్తి.

"ఒరేయ్! నన్ను... నన్ను ముందుగా నువ్వు క్షమించాలిరా! నీ పుస్తకావిష్కరణ ఫంక్షనుకు రాలేక పోయాను. నా మిత్రుడు మంచి కథా రచయిత అని నాకు ఈ మధ్య తరచు వివిధ పత్రికలలో నీ పుస్తకం మీద సమీక్షలు చదువుతుంటే అర్థం అయింది. మనం చదువుకునే రోజుల్లో వ్రాసే వాడివి కాదు కదురా?

## వంతెన

రెండు విభిన్న
భాషా వర్గాల్ని
కలుపుతూ వంతెన!
అయితే
కింద నుంచి పారే
నదీమ తల్లి
ముందులాగానే
సంస్కృతి నిలబెడుతోంది
వంతెన ప్రయాణ మార్గం మాత్రమే!
అందుకే
నదుల గురించి
కత్తులు నూరి
సంస్కృతి మంట కలపకండి!!

-జి.శైలూషి

ఎలా అబ్బింది నీకు ఈ అలవాటు?"

నేను వాడి భుజం మీద చరిచి పకపకా నవ్వాను.

"చూశావా! నువు గుర్తు చేసే వరకు నేనో కథా రచయితను అన్న విషయమే మర్చిపోయాను. అనుభవం నేర్పిందిరా! మనసులో ఎవరితోనూ చెప్పుకోలేని బాధ కలిగినపుడు పేపరు మీద పెట్టడం అలవాటు చేసుకున్నాను. నా పేరే వ్రాసుకుంటే 'మిమ్మల్ని అంత కష్టపెడుతున్నానా' అని నా భార్య అడుగుతుందేమోనని పాత్ర పేరుమార్చి వ్రాయడం అలవాటు చేసుకున్నాను. దాంతో అది కథ అయ్యేది. ఓసారి సరదాగా ఏదో కథల పోటీకి పంపితే మూడవ బహుమతి వచ్చింది. ఆ స్ఫూర్తితో కథా రచయితనయ్యాను. అన్నట్టు మీ ఫామిలీ విశేషాలేంటి? మీ నాన్న గారు ఎలా ఉన్నారు? ఏమిటి?"

"మా నాన్న గార్ని నువ్వెప్పుడూ చూడలేదు కదురా!" ఆశ్చర్యపోతూ అడిగాడు చక్రవర్తి.

"ఒక్కొక్కరికి ఒక్కొక్క పిచ్చిరా! నాకు మా నాన్న గారి పిచ్చి. అందరినీ మీ నాన్న గారెలా ఉన్నారని అడిగి తిట్లు చివాట్లు తింటుంటాను" అంటూ ఏదో అనబోయేటంతలో ఏలూరు బస్ వచ్చి ఆగింది.

"ఒరేయ్ చక్రీ! యిది నా విజిటింగ్ కార్డ్. అందులో నా ఫోన్ నంబరు ఉంది. నీకు ఖాళీ అయినపుడు ఫోన్ చేస్తే అన్ని వివరాలూ మాట్లాడు కుందాం. యీసారి వచ్చినపుడు మీ యింటికి తప్పనిసరిగా తీసుకువెళ్ళాలి. సరేనా?" అని వాడికి పర్సులోంచి విజిటింగ్ కార్డు తీసి యిచ్చాను.

"అలాగేరా!" అంటూ నా విజిటింగ్ కార్డు అందుకుని "వస్తారా బై!" అంటూ గబగబా వెళ్ళి పోయాడు చక్రవర్తి.

నేను కదులుతున్న బస్ ఎక్కుతూ ముస లాయన కోసం ఆత్రంగా ఆ పరిసరాలన్నీ వెతి కాను. ఆయన ఎక్కడా కనబడలేదు.

బస్ బయల్దేరింది.

☆☆☆

సుమారు నెల రోజుల తరువాత–

నాకు ఓ ఉత్తరం వచ్చింది. అందులో యిలా ఉంది.

"మాన్యులు, గౌరవనీయులు, ప్రముఖ కథా రచయిత ప్రభాకర్ గార్కి, నా హృదయపూర్వక నమస్కారాలు.

నా పేరు ఉమా మహేశ్వరరావు. పుట్టుకతోనే ఆస్తిపరుడిని. ఏకైక కుమారుడిని కావడంతో నన్ను గారంగా పెంచారు. దాంతో స్నేహితులు, వ్యస నాలు పుష్కలంగా నా చుట్టూ చేరాయి. వివాహం చేస్తే మారతాననే ఉద్దేశ్యంతో పెళ్ళి కూడా చేశారు. యీలోగా నేను వెలగబెట్టిన డిగ్రీతో మా నాన్న గారు ఓ గవర్నమెంటు ఉద్యోగం కూడా వేయిం చారు.

పెళ్ళయింది. ఎంత కాలానికీ సంతానం కలగ లేదు నాకు. నా భార్య సలహాతో తన తమ్ముడి కొడుకుని దత్తత తీసుకుని పెంచడం మొదలు పెట్టాము. ఎవరో యింటి పిల్లవాడు నా యింట్లో పెరగడం నా అసమర్ధతగా భావించి వెక్కిరించడం మొదలుపెట్టారు స్నేహితులు. ఆ ప్రయత్నంలో నన్ను చేతబడి చేయించే వాడి దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఎవరైనా ఎనిమిదేళ్ళ వయసు బాలుడిని బలి యిస్తే నా భార్యకు నా వల్ల సంతానం కలుగు తుందని అతను యిచ్చిన సలహా మేరకు పక్కింటి వారి అబ్బాయిని ఎవరూ లేని సమయం చూసి కిడ్నాప్ చేసి చేతబడి వాడికి అప్పగించాను. అతను నా ముందే ఆ పిల్లవాడిని క్షుద్రదేవతకు బలి యిచ్చాడు. సరిగ్గా ఆ కార్యక్రమం పూర్తయింది అనుకున్న సమయంలో పోలీసులు వచ్చి నన్ను, అతన్ని సాక్ష్యాధారాలతో సహా అరెస్ట్ చేశారు. సలహా యిచ్చిన స్నేహితులెవ్వరూ కనీసం పరామర్శకు కాదు కదా! కన్నెత్తి చూడలేదు. నా ఉద్యోగం పోయింది. జైలు శిక్ష పడింది. కేవలం కిడ్నాప్ చేసిన నేరానికి ఏడు సంవత్సరాలు కఠిన కారాగర శిక్ష అనుభవించి బయటకు వచ్చాను.

జైల్లో నాకు జ్ఞానోదయం అయింది. నాకు సంస్కారం లేదు. నేను చదివిన చదువు నాకు సంస్కారం నేర్పలేదు. అయినా నా విజ్ఞత, విచక్షణా జ్ఞానం ఏమయ్యాయో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. 'చేతబడి'ని నమ్మి, నరబలి యిస్తే పిల్లలు కలుగుతారనుకున్న నేను ఒక మానసిక రోగినని, పిల్లలు పుట్టకపోవడానికి నా అసమర్థతో, నాలో శారీరక లోపమో కారణం అని అర్థం అయింది. అప్పుడు నేను చేసిన తప్పు నాకు అర్థం అయింది.

నేను యింటికి చేరేసరికి నాన్నగారు పోయారు. నా భార్య మంచంలో ఉంది. చెరువులో కప్పల్లా ఆమె మంచం చుట్టూ ఆమె తమ్ముడు, భార్య చేరారు కొడుకును పెంచే నెపంతో. నాకు నా మాటకు విలువ లేకుండా పోయింది. దత్తత తీసుకున్న నా కొడుకు నన్ను అసహ్యించుకున్నాడు. 'పిల్లల్ని కనే ఉద్దేశ్యం

ఉన్నపుడు నన్ను ఎందుకు దత్తత తీసుకున్నావు?' అని నిలదీశాడు. నేనేం బదులు యివ్వలేకపోయాను.

చదువు పూర్తయ్యాక వాడు ప్రేమించిన అమ్మాయిని యిచ్చి పెళ్ళి చేసి వెళ్ళిపోయారు వాడి అమ్మా నాన్న! అంతే! ఆరోజుతో నేను పూర్తిగా చచ్చిపోయాను.

నేను బ్రతికి ఉన్నంతకాలం వడ్డీ మాత్రం తీసుకునేలా కొంత సొమ్ము బ్యాంకులో డిపాజిట్ చేయించాడు నా కొడుకు. నామినీ తన పేరే పెట్టుకున్నాడు. అదేనా నా మందుల కోసం మాత్రమే అని చెప్పాడు. 'మరి భోజనం'? అడిగాను నేను. 'ఏదైనా పని చేసుకుని ఆ డబ్బుల్తో బయట తినేయి' అన్నాడు. వాడి పట్ల నేను తప్పుగా ప్రవర్తించిన మాట వాస్తవమే. దాంతో నాకు పౌరుషం వచ్చింది. నేను యింట్లోంచి బయటకు వచ్చేశాను.

జైల్లో ఉండగా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్న నాకు యీనాడు అదే జీవనాధారం అయింది. వీక్లీలలో చివర పుస్తక సమీక్షలు పడుతుంటాయి. ఆయా రచయితల అడ్రసుకు నా పరిస్థితి తెలియచేస్తూ ఒక పుస్తకం పంపమని వ్రాస్తూ ఉంటాను. అలా దయతలచి పుస్తకం వారు పంపాక దాన్ని ఆసాంతం చదివేసాక అమ్మేస్తాను. అంటే నేను మొబైల్ బుక్ సెల్లర్‌ను. ఆ అమ్మిన కష్టార్జితంతోనే మందులు వేసుకుంటుంటాను. నా కొడుకు ఉన్న వూరిలోనే నేను ఉన్నా, తటస్థ పడినా ఒకరినొకరు పలకరించుకోము. కన్నెత్తి చూడనైనా చూసుకోము.

మీ కథామాలిక సమీక్షను యిటీవల చదివాను. కావున నా పరిస్థితి గమనించి మీకు వీలైతే మీ పుస్తకం 'ఉచితం'గా పంపండి. లేదా యీ ఉత్తరాన్ని చించి ముక్కలు చేసి డస్ట్ బిన్‌లో వెయ్యండి.

మీ కథల మీద సమీక్ష చదివాక మీరు 'మానవతా విలువల'కు యిచ్చే ప్రాధాన్యత అర్థం చేసుకుని యింత పెద్ద ఉత్తరం వ్రాస్తున్నాను. సాధారణంగా నా కథను ఎవరికీ తెలియచేయడం నాకు యిష్టం ఉండదు. ఎందుకంటే తెలియక తప్పు చేసిన వాడిని క్షమించవచ్చు. తెలిసి తప్పు చేసేవాడు క్షమాభిక్షకు అనర్హుడు. వాడు నిర్దాక్షిణ్యంగా శిక్షింపబడవలసిందే. అవతల వ్యక్తి ప్రాణం విలువ ఎంతో, తన ప్రాణము విలువ అంతే అనే విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకునేలా ఉండాలి ఆ శిక్ష. ఆనాడే సమాజంలో నేరాలు-ఘోరాలు తగ్గుతాయి. అమాయకులు బలి కాకుండా కొంతవరకు నిరోధించ వచ్చు.

యిదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే మీకు ఓ కథాంశంగా నా అనుభవం ఉపయోగపడాలని.

మీరు రచయితగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తూ- మీ పుస్తకం తప్పక పంపుతారని ఆకాంక్షిస్తూ-

-ఆశీస్సులతో ఉమామహేశ్వరరావు

అక్షరాలు మసకబారుతుంటే అర్థం అయింది నాకు తెలియకుండానే కళ్ళు చమర్చాయని.

నాకు వెంటనే నెల రోజుల క్రితం బస్ స్టాండ్‌లో కలిసిన ముసలాయనే గుర్తుకు వచ్చాడు. ఆనాడు ఆయన దగ్గర కొన్న పుస్తకాలు గుర్తుకు వచ్చాయి. అసలు వాటిని ఆనాడు బస్‌లో కూడా తీయనే లేదు. కారణం బస్సెక్కాక విపరీత వర్షం. దాంతో పక్కవాడిని ఓ పాలిథిన్ కవర్ అడిగి అందులో భద్రంగా దాచి యింటికి వచ్చాక నా పుస్తకాల రాక్‌లో పడేశాను.

వెంటనే లేచి ఆ కవరు అందుకుని పుస్తకాల మొదటి పేజీలు తిరగేశాను.

ఆత్మీయ సాహితీ పోషకులు శ్రీ ఉమా మహేశ్వరరావు గారికి- అభినందనలతో- 'ఆరుద్ర'- అని ఉంది కూనలమ్మ పదాల పుస్తకంలో.

అలాగే మిగతా రెండు పుస్తకాలలో కూడా!

నాకు ఆయనే ఉమామహేశ్వర రావు గారని రూఢి అయింది.

☆☆☆

ఆ ఉత్తరంతో నాలో ఎన్నాళ్ళుగానో ఉన్న ఆలోచన రూపు దిద్దుకుంది. దాని ఫలితమే నేను ఉమా మహేశ్వర రావు గారిని కన్వీనర్‌గా నియమించి మా వూరిలో ఏర్పాటు చేసిన వృద్ధా శ్రమం.

దానిని చక్రవర్తిని ప్రత్యేక అతిథిగా పిలిచి ప్రారంభోత్సవం చేయించాను. తనకు అంత ప్రత్యేక స్థానం యిచ్చి గౌరవించినందుకు చక్రవర్తి సంబరపడిపోయాడు.

హుందాగా నిండైన విగ్రహంతో తెల్లని వస్త్రా లలో మెరిసిపోతున్న ఉమా మహేశ్వరరావు గారిని చక్రవర్తికి 'మా నాన్నగారు'గా పరిచయం చేశాను.

"ఈయన మీ నాన్నగారా?" విస్తుపోయాడు చక్రవర్తి.

"కాదురా! నాకు దేవుడు యిచ్చిన తండ్రి" అన్నాను.

ఉమా మహేశ్వరరావు గారు చక్రవర్తికేసి నిర్లిప్తంగా చూసి "వెళ్ళి నా పని చూసుకుంటాను బాబూ!" అని

వెళ్ళిపోయారు.

"నువ్వు వృద్ధాశ్రమం పెట్టడం వరకు బాగానే ఉంది. యీయన నీకు ఎక్కడ దొరికాడు రా?" చక్రవర్తి విసుగ్గా అడిగాడు.

"ఏం ఆయన గాని నీకు తెలుసా?" ఆర్ధోక్తిగా అడిగాను నేను.

.........

"చూడు చక్రవర్తీ! జీవితం పేకలతో ఆడే సీక్వెన్స్ ఆట లాంటిది. నీకు అక్కర్లేని ముక్క క్రింద పడేస్తే అది అవసరమైన వాడు దాన్ని వాడుకుని సీక్వెన్స్ చేసుకుంటాడు. అలాగే ఆయన వాళ్ళ వాళ్ళకి అక్కర్లేదు. ఆయనను నేను చూడటం తటస్థించడం వల్లనే ఎన్నాళ్ళుగానో నాలో బీజం వేసుకున్న నా ఆశయం రూపం దాల్చింది. యిక్కడ కాస్తో కూస్తో పేరు ప్రఖ్యాతులు ఉన్నందువల్ల నాకు విరాళాలు బాగానే వచ్చాయి. దాంతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి నేను ఛైర్మన్‌గా, ఆయనను కన్వీనర్‌గా ఏర్పాటు చేయడం జరిగింది."

"నీ మొహం. ఆయనది మా వూరే. ఆయన జైలుకు వెళ్ళి వచ్చాడు తెలుసా? ఆయన జైలుకు ఎందుకు వెళ్ళి వచ్చాడో కూడా తెలుసు చక్రవర్తీ. మనిషి తప్పు చేయడం సహజం. కానీ చేసిన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడి తన కాళ్ళ మీద తాను ఈ వయసులో ఎవరి మీద ఆధారపడ కుండా బ్రతికే ఆయన మారిన మనిషే కాదు. మహ నీయుడు కూడా.

అంతెందుకు? నువ్వు ఏనాడూ తప్పే చేయకుండా పెరిగావా? అవతల వాళ్ళ తప్పులు ఎత్తి చూపడం చాలా తేలిక చక్రీ. అది చాలా తప్పు పద్ధతి కూడా.

ఆయనను ఈ వయసులో నిర్లక్ష్యం చేశారు. ఆయన కుటుంబ సభ్యులు. ఆయనే నీ తండ్రి అయితే అలా వదిలేసే వాడివా?" సీరియస్‌గానే అడిగాను.

"నీకు ఆయన సంగతి తెలియదు. ఘోరమైన నేరం చేశాడు. కొడుకు మీద పౌరుషంతో యిల్లు వదిలి వచ్చేసి బస్ స్టాప్‌లో పుస్తకాలమ్ముకునేవాడు. అందరి ముందు కొడుకు పరువు తీసేశాడు. పది మందిలోను కొడుకు అవమానపడేలా చేశాడు" చక్రవర్తి కోపంగా అన్నాడు.

"నువ్వు కొడుకు వైపే ఆలోచించి మాట్లాడు తున్నావు. ఏ తండ్రీ నా కొడుకు భవిష్యత్తులో నన్ను చూడడేమో అని పిల్లల్ని కనడు. అలా అనుకుంటే పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడతాడు. అంతెందుకు? రేపు నీ పిల్లలు నిన్ను సవ్యంగా చూస్తారని నమ్మకం ఏమిటి? నీలోనే తండ్రి అంటే యింత అసహ్యం ఏర్పడినపుడు నీ జీన్స్ నీ పిల్లలకు వచ్చి వారు నిన్ను భవిష్యత్తులో ఏవగించు కోరని నమ్మకం ఏమిటి?"

చక్రవర్తి నిరుత్తరుడయ్యాడు.

"అవును చక్రీ! ఎన్నో వూహించని మలుపు లతో కథలు వ్రాయగలిగిన నేను ఆయన నీ కన్న తండ్రి అని, బస్ స్టాప్‌లో నన్ను చూసి ఆనందంగా నా దగ్గరకు రాబోయి పని ఉందని వెళ్ళి ఆయన నా దగ్గర నుంచి వెళ్ళపోయాక వచ్చావే ఆనాడే గ్రహించాను. నువ్వే కాదు. నీలాగ ఎందరో యీనాడు జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆస్తి కోసం హత్యలు చేస్తున్నారు. నా పాయింట్ ఏమిటంటే నీకే నీ తండ్రిని హత్య చేయాలన్న ఆలోచన వస్తే నీ జీన్స్ పంచుకు పుట్టిన కొడుకు చేతిలో నువు ఏమవుతావో ఆలోచించు కోమని. తల్లి నవమాసాలు మోసి కంటే తండ్రి పోషించి యింతగా ఎదిగి మన బ్రతుకు మనం బ్రతికేలా పెంచిన కృతజ్ఞతకే ప్రతి కొడుకు తల్లి తండ్రుల కాళ్ళకి సాష్టాంగ పడాలిరా! అందుకే తల్లితండ్రులని ప్రత్యక్ష దైవాలు అన్నారు పెద్దలు. మనం అశక్తులుగా ఉన్నపుడు వారి పొత్తిళ్ళల్లో ఉన్నపుడే ఓ వడ్ల గింజ నోట్లో పడేస్తే నువ్వేంటి? నీ బ్రతుకేంటి? ఆలోచించు.

మనం పిల్లలుగా ఉన్నపుడు వారు మనకు ఆధారమైనట్టే, వారు వృద్ధులయ్యాక మనం వారి ఆధారం కాకపోయినా కనీసం చేయూతనైనా యివ్వగలగాలి కదా! యిదే ఓ కన్న తండ్రికి కొడుకుగా తీర్చుకునే రుణం? యిపుడే అక్కర్లేదు. బాగా ఆలోచించు. ఏనాడు నువు పశ్చాత్తాపపడి వచ్చినా నిన్ను క్షమించే పెద్ద దిక్కు నా దగ్గర క్షేమంగా ఉందని మర్చిపోకు. ఆరోజు నీతో సహా నీలాంటి కొడుకులందరికీ రావాలనే నిన్ను యీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిలిచాను..." నా మాట పూర్తి కాకుండానే–

"ప్రభూ! వస్తానురా! వెళ్ళొస్తాను. మళ్ళీ తప్ప కుండా వస్తాను..." గుండె పొరల్లోని దుఃఖంతో గొంతు పూడుకుపోయి, గాద్గదికంగా అంటూనే సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్ళు నాకు కనిపించకూడ దని కాబోలు నేను పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు వేగంగా చక్రవర్తి.

ఏదో ఒకనాడు అతను తప్పక తిరిగి వస్తాడు. అవును కదూ!!! ■